ఒక గుడి కడితే
వెయ్యి మంది బిక్షగాళ్ళు
తయారవుతారు అదే.. ఒక బడి కడితే
వెయ్యి మంది మేధావులు
తయారవుతారు
- డా. బాబాసాహెబ్ అంబేద్కర్

Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 271 | సోమవారం 23 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## కేంద్రమంత్రులతో
# మోడీ కీలక భేటీ

- పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ సమావేశం
- పెట్రోలియం, విద్యుత్, ఎరువులపై చర్చ
- సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- హాజరైన రాజ్‌నాథ్, అమిత్ షా, నడ్డా, పలువురు మంత్రులు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో భారత్‌లో ఇంధన సంక్షోభం ఆందోళన కలిగిస్తున్నది. ఈ తరుణంలో ప్రధాని మోడీ.. పలువురు కేంద్ర మంత్రులతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై వారితో చర్చించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోడీ చర్చించారు. గ్యాస్, పెట్రోల్, ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని.. సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని

- మిగతా 2లో..

## ఖతార్‌లో కూలిన
# సైనిక హెలికాప్టర్
### - ఆరుగురు సిబ్బంది దుర్మరణం



దోహా - సూర్య వాస్తవం

ఖతార్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఆ దేశానికి చెందిన ఒక సైనిక హెలికాప్టర్ సముద్ర జలాల్లో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించగా ఒకరు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడమే ప్రమాదానికి కారణమని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేసింది. "ఖతార్‌కు చెందిన హెలికాప్టర్ రొటీన్ డ్యూటీలో ఉండగా సాంకేతిక సమస్య కారణంగా దేశ జలాల్లో కూలిపోయింది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నది.ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో మొత్తం

- మిగతా 2లో..

- హార్ముజ్ సమీపంలో కూల్చివేసినట్టు ప్రకటన
- ట్రంప్ '48 గంటల అల్టిమేటం' అనంతర పరిణామం

# 'ఎఫ్-15'పై ఇరాన్ దాడి



టెహ్రాన్ - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల నడుమ అమెరికా, ఇరాన్‌లు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నాయి. హార్ముజ్‌ను 48 గంటల్లో తెరవాలనీ, లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. అయితే తమ నుంచి కూడా ప్రతిఘటన తప్పదని ఇరాన్ సైతం బదులిచ్చింది. దీంతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. శత్రు దేశానికి చెందిన ఎఫ్-15ను లక్ష్యంగా చేసుకొని క్షిపణులతో దాడి చేసినట్టు పేర్కొంది. దక్షిణ తీర ప్రాంతం హార్ముజ్ ద్వీపం సమీపంలో ఇరాన్ మీదుగా ఎగురుతున్న 'శత్రువు' ఎఫ్-15 యుద్ధ విమానాన్ని అడ్డగించి, తమ క్షిపణులతో కూల్చివేసినట్టు వివరించింది. ఈ మేరకు ఇరాన్ వైమానిక రక్షణ ప్రధాన కార్యాలయం ఆదివారం తెలిపింది.

- మిగతా 2లో..



## ఆర్యవైశ్యులకు
# సముచిత స్థానం
### - సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఊరుకొక్కరున్నా ఆర్యవైశ్యులు ఆధిపత్యం చూపిస్తుంటారనీ, తెలంగాణ పునర్ నిర్మాణంలో వారిది కీలకపాత్ర అని చెప్పారు. తెలంగాణ ఆర్థిక అభివృద్ధిలో వారు భాగస్వాములన్నారు. ఆర్య వైశ్యులకు 6 మున్సిపల్ చైర్మెన్ పదవులతోపాటు ఒక మేయర్ పదవి ఇచ్చి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించామని గుర్తుచేశారు. రాచరికంలో అధికారం మారాలంటే హింస తప్పనిసరిగా

- మిగతా 2లో..

## ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 శాతం తల్లిదండ్రులకు..

- 18 ఏండ్లలోపు పిల్లల డిజిటల్ మీడియాపై నియంత్రణ
- విద్వేష ప్రసంగాల నిరోధానికి చట్టం
- సాధ్యాసాధ్యాలపై చర్చించనున్న మంత్రివర్గం
- సీఎం రేవంత్ అధ్యక్షతన నేడు క్యాబినెట్

2లో



## నేడు పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు
### -- విపత్తుల నిర్వహణ సంస్థ

2లో

## అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల
# బ్యాలెన్స్ కోల్పోయాను
### - సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్-2026లో సీఎం చంద్రబాబు



హైదరాబాద్ - సూర్య వాస్తవం

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ)లో జరిగిన సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్-2026 కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎవ్రీథింగ్' అనే అంశంపై ప్రసంగించారు. ఒకప్పుడు బంజరు భూమిగా ఉన్న హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపిన తన ప్రస్థానాన్ని, రాజకీయంగా ఎదురైన సవాళ్లను, భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ కోసం తనకున్న దార్శనికతను ఆయన పారిశ్రామికవేత్తలతో పంచుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనేవి మూడు కీలక స్తంభాలని, వీటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

**బంజరు భూమి నుంచి భాగ్యనగరంగా...**

1995లో తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేనాటికి హైదరాబాద్, సికింద్రాబాద్ అనే జంట నగరాలు మాత్రమే ఉన్నాయని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పీవీ నరసింహారావు ప్రవేశ పెట్టిన ఆర్థిక సంస్కరణలు, బిల్ గేట్స్ తీసుకొచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని గమనించి, భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీదే అని తాను దృఢంగా విశ్వసించానని తెలిపారు. అప్పట్లో సైబరాబాద్ ప్రాంతం మొత్తం పాములు, ముళ్లపొదలతో నిండిన బంజరు భూమి అని, అక్కడ హైటెక్ సిటీ నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ మొదట

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

- సిద్దిపేటలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే మంత్రి పదవి
- రూ.3500 కోట్ల రైతు భరోసా విడుదల
- ఎగుమతులు చేసే స్థాయికి రైతులు ఎదగాలి
- వ్యవసాయమూ తెలుసు.. చీడపీడలకు ఏ మందు వేయాలో తెలుసు
- అన్ని నియోజకవర్గాల్లో సమానంగా అభివృద్ధి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం, రైతు ఉత్సవాల సభ
- వంట నూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

# మళ్లీ అధికారం మాదే

మెదక్ - సూర్య వాస్తవం

"రైతులు ఒకే విధంగా పంటలు వేయకుండా పంటల మార్పిడి చేసుకోవాలి.. దానివల్ల పంటలు పుష్కలంగా పండి ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటారు. వాణిజ్య పంటల సాగువైపు మళ్లాలి. రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నాం.. రాష్ట్రంలోని 73 లక్షల మంది రైతులకు ఈ పెట్టుబడి సాయం అందనుంది. రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో నర్మెట్ట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌పామ్

- మిగతా 2లో..



## కేంద్రమంత్రులతో
# మోడీ కీలక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్పీజీ కేటాయింపులను పెంచింది.

పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరాను పెంచేందుకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ దరఖాస్తులను 10 రోజులలోపు పరిష్కరించాలని పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో) ఆదేశించింది. ఎల్పీజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, పీఎన్‌జీకి మారాలని పట్టణ, నగరాల్లోని వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులకు సూచించింది. అటు ఎల్పీజీకి సంబంధించి ఇప్పటికే పునరుద్ధరించిన 20 శాతానికి అదనంగా మార్చి 18న మరో 10 శాతం, మార్చి 21న మరో 20 శాతం కేటాయింపులు పెంచారు. ఫలితంగా సరఫరా 50 శాతానికి చేరింది. హోటళ్లు, రెస్టారెంట్లు, డైరీ పరిశ్రమలు, కమ్యూనిటీ కిచెన్‌లు, విద్యా సంస్థలకు సరఫరాలో ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డొమెస్టిక్ వంట గ్యాస్ సరఫరా స్థిరంగా ఉందని, ఎక్కడా కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. భయాందోళనలతో చేసే బుకింగ్‌లు కూడా తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం పేర్కొంది.

## ఖతార్‌లో కూలిన
# సైనిక హెలికాప్టర్

(మొదటిపేజీ తరువాయి)

ఏడుగురు సిబ్బంది ఉన్నారని ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

వారిలో ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన ఏడో వ్యక్తి కోసం కోస్ట్‌గార్డ్, బార్డర్ సెక్యూరిటీ, అంతర్గత భద్రతా దళాలకు చెందిన ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ ఘటన జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఇది కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిన ప్రమాదమేనని, దీని వెనుక ఎలాంటి శత్రుచర్య లేదని అధికారులు స్పష్టంచేశారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ రకం, అది కూలిపోయిన కచ్చితమైన ప్రదేశం లాంటి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# 'ఎఫ్-15'పై ఇరాన్ దాడి

(మొదటిపేజీ తరువాయి)

అయితే ఆ విమానం పూర్తిగా కూలిపోయిందా లేదా దెబ్బ తిందా అన్న విషయంపై ఒక స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై విచారణ కొనసాగుతున్నట్టు ఇరాన్ తెలిపింది. కాగా యుద్ధ విమానంపై దాడికి సంబంధించిన వీడియోను 'ఫార్స్ న్యూస్ ఏజెన్సీ' తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ సంఘటనకు ముందు కూడా అమెరికాకు చెందిన అత్యంత అధునాతన ఎఫ్-35ను కూడా తన వైమానిక రక్షణ వ్యవస్థల ద్వారా దెబ్బతీసినట్టు ఇరాన్ ప్రకటించిన విషయం విదితమే. అమెరికా అధికారులు సైతం ఆ విమానం దెబ్బతిన్నదని ప్రకటించినప్పటికీ.. పూర్తి వివరాలను ప్రకటించకపోవడం గమనార్హం. శత్రువు నిఘాకు సైతం చిక్కని ఎఫ్-35ను ఇరాన్ దెబ్బతీసిందన్న వార్త ప్రపంచవ్యాప్తంగా ఆశ్చర్యానికి గురి చేసింది. ఇది ఇరాన్ యుద్ధ, వైమానిక శక్తిని ప్రపంచానికి తెలియపర్చినట్టయ్యిందని నిపుణులు చెప్పారు.

## ఆర్యవైశ్యులకు
# సముచిత స్థానం

(మొదటిపేజీ తరువాయి)

ఉండేదనీ, కానీ మహాత్మా గాంధీ ఒక్కరే అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని తెలిపారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని అహింస, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహంతో పారదోలిన గొప్ప తత్వవేత్త గాంధీ అని కొనియాడారు. దేశ అభివృద్ధిలో ఆర్య వైశ్యులు భాగస్వాములనీ, అవకాశాలు వచ్చినా, రాకున్నా క్రమశిక్షణ ఉల్లంఘించకుండా ఓపికతో ఉంటారని ప్రశంసించారు. తనకు ఇష్టమైన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య అనీ, ఆయనతో వాదించడం ,ప్రశ్నించడం గౌరవంగా ఉండేదని తెలిపారు. రోశయ్య విగ్రహం లక్డీకాపూల్‌లో పెట్టి ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామనీ, టీజీ వెంకటేష్ కూడా రాయలసీమలో ఇతరులకు ధీటుగా ఎదిరించి గెలిచి రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. ఆర్యవైశ్యుల ఆలోచనలే ప్రభుత్వ విధానమనీ, వారి గౌరవానికి భంగం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రి టీజీ భరత్, తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## నేడు పిడుగులతో
## కూడిన మోస్తరు వర్షాలు

### -- విపత్తుల నిర్వహణ సంస్థ

**అమరావతి - సూర్య వాస్తవం**

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఈ నెల 23న పలు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సోమవారం నాడు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించింది. ప్రజలు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించింది.

## అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల
# బ్యాలెన్స్ కోల్పోయాను

(మొదటిపేజీ తరువాయి)

వెనుకాడిందని చెప్పారు. అయితే, వారిని ఒప్పించి పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో కేవలం 15 నెలల్లోనే ఆ అద్భుత కట్టడాన్ని పూర్తి చేశామని వివరించారు. ఆ తర్వాత బిల్ గేట్స్‌ను కలిసి, కేవలం 10 నిమిషాల అపాయింట్‌మెంట్‌లో 45 నిమిషాల పాటు చర్చించి, భారతీయుల ప్రతిభను వివరించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటుకు ఒప్పించానని, ఆ రోజు తాను వేసిన పునాది వల్లే ఈ రోజు హైదరాబాద్ ఐటీ హబ్‌గా విలసిల్లుతోందని అన్నారు.

**ఐఎస్బీ, విమానాశ్రయం.. హైదరాబాద్‌కు కొత్త రూపు**

హైదరాబాద్‌కు ఐఎస్బీని తీసుకురావడానికి తాను పడిన శ్రమను చంద్రబాబు వివరించారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు కలిసి ముంబై, బెంగళూరు, చెన్నైలలో ఐఎస్బీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలియగానే, తాను వెంటనే వారిని సంప్రదించి హైదరాబాద్‌కు ఆహ్వానించానని తెలిపారు. వారిని ఒప్పించడానికి తన మంత్రివర్గ సహచరులను విమానాశ్రయానికి పంపి, తానే స్వయంగా వారికి అల్పాహారం వడ్డించానని గుర్తు చేసుకున్నారు. మిగతా నగరాలు ఇచ్చే ఆఫర్ల కన్నా "బెస్ట్ ప్లస్ వన్" ఇస్తానని ఒక్క మాటతో హామీ ఇచ్చానని, తన చిత్తశుద్ధిని నమ్మి వారే హైదరాబాద్‌లో ఐఎస్బీ ఏర్పాటుకు ముందుకొచ్చారని చెప్పారు. అలాగే, చిన్నగా ఉన్న బేగంపేట విమా నాశ్రయానికి ముందుగా ట్రాఫిక్ పెంచి, ఆ తర్వాత 5,000 ఎకరాల్లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా నిర్మించామని తెలిపారు.

**అభివృద్ధి చేసినా.. రాజకీయంగా ఎదురుదెబ్బలు**

ఎంత అభివృద్ధి చేసినప్పటికీ, రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజమని చంద్రబాబు అన్నారు. 1999 నుంచి 2004 వరకు హైదరాబాద్ అభివృద్ధికి ఎన్నో పనులు చేసినా, 2004 ఎన్నికల్లో ఓటమి పాలయ్యానని అంగీకరించారు. "అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను. కేవలం అభివృద్ధి చేస్తే సరిపోదు, రాజకీయాలను కూడా చూసుకోవాలని ఆ ఓటమి నాకు నేర్పింది" అని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల తర్వాత 2014లో అధికారంలోకి వచ్చినా, రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. 2019లో మరోసారి ఓటమి ఎదురైందని, ఈ అనుభవాలు తనను మరింత రాటుదేల్చాయని తెలిపారు.

**విభజన తర్వాత.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా**

2024లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇప్పుడు తన ముందున్న ఏకైక లక్ష్యం "స్వర్ణాంధ్ర ప్రదేశ్" నిర్మాణమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని, దానిని తిరిగి పునర్నిర్మించే పనిలో ఉన్నానని చెప్పారు. గత 21 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, దీని ద్వారా 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని వివరించారు. గూగుల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో భారీ డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయని, అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. విజన్ 2047 డాక్యుమెంట్ సిద్ధం చేశామని, వచ్చే 15 ఏళ్ల పాటు ఏటా 15శాతం వృద్ధి రేటు సాధించి, 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అన్నారు.

**అమరావతి, పోలవరం.. ఏపీకి జీవనాధారాలు**

అమరావతి కేవలం రాజధాని కాదని, అది ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 33,000 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేసిందని, ఇప్పుడు మళ్లీ పనులు వేగవంతం చేశామని తెలిపారు. అమరావతిని హైదరాబాద్ ప్లస్ సిటీగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నివాసయోగ్య నగరాల్లో ఒకటిగా నిర్మించి తీరుతా" అని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్రానికి జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ మరమ్మతులు పూర్తిచేసి, వచ్చే ఏడాదికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

**సంపద సృష్టితో పాటు.. సమాజ సేవ ముఖ్యం**

పారిశ్రామికవేత్తలు సంపద సృష్టితో పాటు సామాజిక బాధ్యతను కూడా విస్మరించవద్దని చంద్రబాబు పిలుపునిచ్చారు. తాను గతంలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ3) మోడల్‌ను ప్రోత్సహించానని, ఇప్పుడు సమాజంలోని అసమానతలను తగ్గించడానికి పీ4 మోడల్‌ను ముందుకు తెస్తున్నానని చెప్పారు. "వీడీఖ 10-20" అనే కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తున్నానని, అంటే "మార్గదర్శి-బంగారం" అని అర్థమని వివరించారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10శాతం మంది, అట్టడుగున ఉన్న 20శాతం కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. డబ్బు ఇవ్వడమే కాకుండా, వారికి మార్గనిర్దేశం చేసి చేయూతనివ్వడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని హితవు పలికారు.

# మళ్లీ అధికారం మాదే

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమను ఆదివారం మంత్రులతో కలిసి ప్రారంభించారు. అక్కడే నిర్మించతలపెట్టిన వంటనూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు ఉత్సవాల బహిరంగ సభలో రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. ఇవాళ బ్యాంకులకు సెలవు దినం కావడంతో రైతుల ఖాతాల్లో రేపు డబ్బులు జమ కానున్నాయి. తొలి విడతగా ఎకరంలోపు ఉన్న రైతులకు రూ.3,600కోట్లు ఖాతాల్లో జమకాను న్నాయని, ఆ తర్వాత రెండో విడతలో రూ.2,650 కోట్లు, చివరి విడత గా రూ.2,760 కోట్లు విడుదల చేయను న్నామని తెలిపారు. మొత్తం 45 రోజుల్లో రైతు భరోసా కింద 9వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. గతంలో కేసీఆర్ హయాంలో రైతుల కోసం ప్రతినెలా రూ.2533 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం 28 నెలల్లో ప్రతి నెలా రూ.5500 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందని చెప్పారు. తుఫాన్‌కి కామారెడ్డి ప్రాంతాల్లోని పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, పంట నష్టం జరిగితే ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇచ్చామని అన్నారు. ఈ 28 నెలల్లో రైతుల కోసం లక్షా 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు.

**రైతులు వాణిజ్య పంటల వైపు వెళ్లాలి..**

ఒకప్పుడు క్వింటాల్ పసుపు అమ్మితే తులం బంగారం వచ్చేది, కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయని సీఎం అన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని సూచించారు. రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని, రంగారెడ్డి జిల్లా చుట్టూ ఒకప్పుడు పాడి పరిశ్రమ, పండ్ల తోటలు ఉండేవని, ఇప్పుడు రియల్ ఎస్టేట్‌తో అవన్నీ కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట మార్పిడి కోసం రైతులు పూనుకోవాలని, మిల్లెట్స్, ఆకు కూరలు లాంటి పంటలు పండించాలని సూచించారు.

**ప్రయివేటు మోజు వద్దు**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెద్ద రైతు.. వ్యవసాయం గురించి ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలియకపోవచ్చని, ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా ఉండటం మన అదృష్టమని ముఖ్యమంత్రి అన్నారు. పంట మార్పిడి కోసం కృషి చేయాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ప్రధానిని కలుస్తామన్నారు. మహిళల కోసం సోదరుడిగా నిలబడుతానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అత్యుత్తమ శిక్షణ పొందిన టీచర్లు లక్ష మందికిపైగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేసే బాధ్యత తీసుకున్నామని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు.

నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రారంభించడమే కాకుండా విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రయివేట్ మోజులో పడొద్దు.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఇంజినీరింగ్ పూర్తి చేస్తే ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ లేదు కానీ ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు)లో చదువుకుంటే ఉద్యోగం కల్పించే బాధ్యత తనది అని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏటీసీల్లో చదివే విద్యార్థులకు ప్రతినెలా రూ.2వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తామని తెలిపారు.

**సిద్దిపేటలో అవకాశం ఇవ్వాలి**

2029లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ గెలవాలని, ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేటను 1984 నుంచి ఒకే కుటుంబం పాలిస్తోందని ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్‌లా తాము వ్యవహరించడం లేదని, నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్వాసితులను ఒప్పించాకే పనులు ప్రారంభించామని తెలిపారు.


"మూసీలో మీ మొసలి కన్నీరు ప్రజలు అర్థం చేసుకోవడం లేదనుకుంటున్నారా? అభివృద్ధి జరగకుండా అడ్డం పడుకుంటామంటే ఊరుకుంటామా? ముఖ్యమంత్రినై సిద్దిపేటకు రాలేదా? 2029లో మళ్లీ గెలిచి సిద్దిపేటకు వస్తామ"ని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. కానీ వారి నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ నిజాయితీ నిరూపించుకుంటున్నామని చెప్పారు. నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు తాను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయని చెప్పారు. నిధుల విషయంలో తానేమీ వివక్ష చూపడం లేదని స్పష్టం చేశారు. కావాలంటే.. 2014 నుంచి 2023 వరకు కొడంగల్‌కు ఎన్ని నిధులు ఇచ్చారు? తామొచ్చాక ఈ ప్రాంతానికి ఎన్ని నిధులు ఇచ్చామో లెక్కలు తీద్దామని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. పేదల కోసం పని చేస్తాం తప్ప రాజకీయ నాయకుల కోసం తాము పని చేయబోమని చెప్పారు. తనకు వ్యవసాయం తెలుసని, చీడపురుగులకు ఏ మందు వేయాలో బాగా తెలుసునని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల
# జీతాల్లో 10 శాతం తల్లిదండ్రులకు..

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

'దేశంలోను, రాష్ట్రంలోనూ కన్నతల్లిదండ్రులను పట్టించుకోని ఉదంతాలను చూస్తున్నాం.. అలా కన్నవారిని గాలికొదిలేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మా ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరించనుంది. వారి జీతాల్లోంచి ఎంతో కొంత తల్లిదండ్రుల ఖాతాల్లోకి జమయ్యే విధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుంటాం...' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో చెప్పిన మాటలివి. ఆయన చెప్పిన ఈ అంశాన్ని సోమవారం నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు క్యాబినెట్ భేటీ కానుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లోంచి కనీసం 10 నుంచి 15 శాతం వరకు తల్లిదండ్రుల ఖాతాల్లో జమయ్యేలా విధానపరమైన నిర్ణయం తీసుకుంటే ఎలా ఉంటుందనే అంశంపై చర్చించనున్నారు.

దీనికి మంత్రివర్గం ఆమోదముద్ర వేస్తే... ఆ వెంటనే అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టనున్నారని సమాచారం. దీంతోపాటు 18 ఏండ్లలోపు పిల్లలను డిజిటల్ మీడియా నుంచి రక్షించేందుకు వీలుగా 'డిజిటల్ మీడియా నిరోధక, నియంత్రణ చట్టాన్ని' తీసుకురావాలనే అంశంపై క్యాబినెట్ చర్చించనుంది. ఇందుకు సంబంధించి వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న పద్ధతులు, సాంకేతికాంశాలను పరిశీలించి విధి విధానాలు ఖరారు చేయటంపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. రాష్ట్రంలో 'మత విద్వేష ప్రసంగాల నియంత్రణ'కు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై కూడా క్యాబినెట్ సమాలోచనలు చేయనుంది. దీనిపై కర్నాటక ప్రభుత్వం ఇప్పటికే కొంత కసరత్తులు చేసింది.



వాటిపై అధ్యయనం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితోపాటు గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిగ్ వర్కర్ల బిల్లు, క్యూర్.. ప్యూర్..రేర్‌లకు సంబంధించిన బిల్లుల సవరణపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదముద్ర వేయనున్నారు. వీటన్నింటిలో ఏయే అంశాలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపితే.. ఆయా అంశాలపై అసెంబ్లీలో బిల్లులను ప్రవేశపెడతారని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో సమయాన్నిబట్టి వాటికి ఆమోదముద్ర వేస్తారు. టైం సరిపోకపోతే వచ్చే వర్షాకాల సమావేశాల్లో వాటిని ఓకే చేస్తారని సమాచారం.

# చక్రం తిప్పుతున్న కరీంనగర్ నేతలు



**కరీంనగర్–సూర్య వాస్తవం :** కరీంనగర్ అంటేనే ఉద్యమాల గడ్డ. నాడు భూస్వాములపై తిరుగుబాటు చేసినా.. తర్వాత రజాకార్లపై తిరగబడినా.. తొలితరం తెలంగాణ ఉద్యమమైనా? మలిదశ తెలంగాణ పోరాటమైనా.. జగిత్యాల జైత్రయాత్ర అయినా.. నక్సల్ ఉద్యమమైనా.. తర్వాత జరిగిన మావోయిస్టు ఉద్యమమైనా కరీనంగర్ వాసులు ఉండాల్సిందే. తాజాగా రాజకీయాల్లోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. కేంద్రం, రాష్ట్ర స్థాయిలో జిల్లా నేతలకు కీలక పదవులు దక్కాయి.. దక్కుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ఈ ప్రాంతం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.కరీంనగర్ నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉన్నారు. కీలకమైన హోంశాఖ సహాయ మంత్రిగా మోదీ 3.0 క్యాబినెట్‌లో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసినందుకు ఆయనకు దక్కిన గుర్తింపు, గౌరవంగా చెప్పొచ్చు. ఇక తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే దుద్దిళ శ్రీధర్‌బాబు కీలకమైన ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నారు. పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సాంక్షిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు.ఇక అధికాక కాంగ్రెస్‌కు చెందిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విప్ పదవి దక్కింది. తన పదవికి తగినట్లుగా ఆయన కార్యదక్షత చూపుతున్నారు. తాజాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కూడా విప్ పదవులు వరించాయి. దీంతో అసెంబ్లీలో కరీంనగర్ శక్తి మరింత పెరిగింది. ఇక మానకొండూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఇక బీఆర్ఎస్‌లో కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీజేపీలో కీలక నాయకుడిగా ఉన్నారు. ఈ పదవులు మూడు పార్టీల్లో కరీనంగర్ జిల్లా బలాన్ని నిరూపిస్తున్నాయి. కరీంనగర్ ప్రాంతం రాజకీయంగా చురుకైన మట్టి కలిగి ఉంది. స్థానిక నాయకులు పార్టీలకు అంకితమై, గ్రామీణ–పట్టణ ప్రజల మద్దతుతో ఎదిగారు. బండి సంజయ్‌కు యువతలో మంచి పట్టు ఉంది. కేటీఆర్ టెక్నాలజీలో యువ ఉద్యోగులను ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండ్ రాష్ట్ర రాజకీయాలకు కొత్త ఊపు ఇస్తూ, జిల్లాను 'పవర్‌హౌస్'గా మార్చుతోంది.ఇప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తి కావొస్తోంది. ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్లే ఉన్నట్లు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశావహులు పదవుల కోసం కాంగ్రెస్ పెద్దలపై ప్రెజర్ పెడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు కూడా క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తులతో మిగిలిపోయిన నామినేటెడ్ పోస్టులు, విప్ పదవుల భర్తీపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బడ్జెట్ సెషన్ వేళ అసెంబ్లీ, శాసన మండలిలో విప్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

**అసెంబ్లీలో కొత్తగా ముగ్గురు విప్‌లకు అవకాశం కల్పించారు.**

**ఇద్దరు విప్‌లకు ప్రమోషన్..**

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌ను విప్‌లుగా నియమించారు. శాసనమండలిలో విప్‌లు లేకపోవడంతో అద్దంకి, బల్మూర్ వెంకట్‌కు అవకాశం దక్కినప్పటికీ..శాసనసభలో మాత్రం ఆల్రెడీ ముగ్గురు విప్‌లు ఉండగా..ఆల్ ఆఫ్ సడెన్‌గా మరో ముగ్గురిని విప్‌లుగా నియమించడంపై సరికొత్త చర్చ జరుగుతోంది.గతంలో విప్‌లుగా నలుగురికి అవకాశం ఇచ్చారు. అందులో ఇద్దరు విప్‌లకు ప్రమోషన్ లభించింది. మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం దక్కగా..రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించారు. కానీ ఇంకా రామచంద్రు నాయక్ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు తీసుకోలేదు. ప్రస్తుతం ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య విప్‌లుగా ఉండగా..కొత్తగా ముగ్గురికి అవకాశం ఇచ్చారుకొత్తగా ఒకేసారి ముగ్గురికి విప్‌లుగా అవకాశం ఇవ్వడం వెనుక..ప్రభుత్వ పెద్దల ఆలోచన మరొకటి ఉందనే టాక్ వినిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే రెండున్నరేళ్లు పూర్తి కావస్తోంది. ఇక మిగిలింది మరో రెండున్నర ఏళ్లు మాత్రమే. ఇక మును ముందు రానున్న కాలం ప్రభుత్వానికి అత్యంత కీలకం అని చెప్పొచ్చు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు వాయిస్ మరింత పెంచే అవకాశం ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడం ఖాయం. దీంతో అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై జరిగే దాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలనే ఆలోచనతో విప్‌ల సంఖ్య పెంచారనే టాక్ వినిపిస్తుంది.ఇక విప్‌లుగా పనిచేస్తున్న వారికి కూడా ప్రమోషన్ లభించే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. గతంలో ఇద్దరికి ప్రమోషన్ దక్కగా..మరో ఇద్దరు కూడా ప్రమోషన్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య ఇద్దరు కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ఆశలు పెట్టుకున్నారు. సామాజిక సమీకరణాలలో భాగంగా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి అవకాశం ఇవ్వాలని ఆది శ్రీనివాస్ చాలా కాలం నుంచి కోరుతున్నారు. తెలంగాణలో..ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో మున్నూరు కాపు బలమైన సామాజిక వర్గం కావడంతో..తమ వర్గానికి క్యాబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలని..ఆ వర్గం నేతలు కూడా పార్టీ పెద్దలను డిమాండ్ చేస్తున్నారు. అలాగే బీర్ల అయిలయ్య కూడా యాదవ సామాజిక వర్గం నుంచి తనకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు.





# రేవంత్ వ్యూహాల ముందు...కేటీఆర్ ఆత్మరక్షణ



**హైదరాబాద్ –సూర్య వాస్తవం :** తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ, అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఒక రసవత్తర యుద్ధానికి వేదికైంది. అయితే, ఈ పోరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడుతూ బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేశారు. ముఖ్యంగా కేటీఆర్ వంటి వారు ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డిని ధీటుగా ఎదుర్కోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. రేవంత్ రెడ్డి అటు రాజకీయ విమర్శలతో పాటు, ఇటు పాలనాపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టారు.ఈ చర్చలో కేటీఆర్ ప్రసంగం అంతా పాత ఆరోపణల చుట్టూనే తిరిగింది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ వంటి అంశాలపై ఆయన చేసిన విమర్శలను మంత్రులు అప్పటికప్పుడు తిప్పికొట్టారు. ముగిసిన అధ్యాయం లాంటి అంశాలను మళ్ళీ మళ్ళీ ప్రస్తావించడం వల్ల ప్రజల్లోకి వెళ్లాల్సిన గట్టి సందేశం పలచబారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలను ఎండగడుతూనే, తమ ప్రభుత్వం భవిష్యత్తులో చేయబోయే పనులపై తెలంగాణ రైజింగ్–2047 వంటి విజన్ డాక్యుమెంట్లను ప్రస్తావించి సభను తన వైపు తిప్పుకున్నారు.ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ మూసీ నదిపై చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను సభలో ప్రదర్శించి, వారి ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చాలని అప్పుడు చెప్పింది మీరు కాదా అని రేవంత్ ప్రశ్నించినప్పుడు, బీఆర్ఎస్ సభ్యుల దగ్గర సరైన సమాధానం లేకపోయింది. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా చేసే విమర్శలను సభలోనూ పునరావృతం చేయడం వల్ల, రేవంత్ వేసిన ప్రత్యూహాల ముందు అవి నిలబడలేకపోయాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఎప్పటిలాగే తక్కువ అంచనా వేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం వాక్చాతుర్యంతోనే కాకుండా, గణాంకాలు పాత రికార్డులతో సిద్ధమై రావడంతో బీఆర్ఎస్ శిబిరంలో గందరగోళం నెలకొంది. పైగా, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు హాజరు కాకపోవడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. రూ. 1.06 కోట్ల జీతభత్యాలు తీసుకుంటూ సభకు రాకపోవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి.రాజకీయంగా రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, మరోసారి గెలిచి చూపిస్తాం అని విసిరిన సవాల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీలో చర్చా సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ, ప్రజలకు కనెక్ట్ అయ్యేలా మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. కానీ, బీఆర్ఎస్ తరఫున మాట్లాడిన నాయకులు కేవలం పాత చింతకాయ పచ్చడి లాంటి విమర్శలకే పరిమితం కావడంతో, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డిని కట్టడి చేసే అవకాశం చేజారిపోయింది. రాబోయే రోజుల్లో అయినా కేటీఆర్ తన వ్యూహాన్ని మార్చుకోకపోతే, అసెంబ్లీలో రేవంత్ రెడ్డిని ఢీకొట్టడం కష్టమేనని స్పష్టమవుతోంది.

# మంగళగిరి మోడల్ సాధ్యమేనా




**గుంటూరు–సూర్య వాస్తవం :**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, మంత్రి నారా లోకేష్ తన పనితీరుతో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించిన తర్వాత, నియోజకవర్గ అభివృద్ధి , ప్రజా సంక్షేమం విషయంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే, లోకేష్ సృష్టిస్తున్న ఈ స్టాండర్డ్ ను అందుకోవడంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం వెనుకబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నారా లోకేష్ మంగళగిరిలో కేవలం ఒక ఎమ్మెల్యేగా కాకుండా, ఒక వ్యవస్థగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మంత్రిగా రాష్ట్రస్థాయి బాధ్యతల్లో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అటు ఐటీ, విద్యాశాఖల మంత్రిగా సచివాలయంలో ఫైళ్లను క్లియర్ చేస్తూనే, ఇటు మంగళగిరిలోని పాఠశాలలకు ఆకస్మిక తనిఖీలకు వెళ్లడం, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం వంటి చర్యల ద్వారా గ్రౌండ్ లెవల్‌లో బలమైన ముద్ర వేస్తున్నారు. పర్యటనల్లో ప్రోటోకాల్ ఆడంబరాలు లేకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యకు వెళ్లడం ఆయన పనితీరులోని ప్రత్యేకత.లోకేష్ తనను తాను ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుకుంటున్న తరుణంలో, టీడీపీలోని చాలామంది ఎమ్మెల్యేలు మాత్రం పాత ధోరణిలోనే సాగుతున్నారు. నియోజకవర్గాల అభివృద్ధి కంటే వ్యక్తిగత ఆధిపత్యం, స్థానిక వివాదాలు మరియు కాంట్రాక్టుల చుట్టూ కొందరు నేతలు తిరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లోకేష్ తరహాలో టెక్నాలజీని వాడుకోవడం లేదా సోషల్ మీడియా ద్వారా ప్రజలతో నిరంతరం టచ్‌లో ఉండటం వంటి అంశాలను వీరు లైట్ తీసుకుంటున్నారు. ఫలితంగా, కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, ఎమ్మెల్యేలు వివాదాల్లో చిక్కుకుంటున్నారు.లోకేష్ పనితీరును అందరూ అనుసరించాలని టీడీపీ హైకమాండ్ బహిరంగంగా ఆదేశాలు ఇస్తున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలను మోటివేట్ చేయడంలో మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. బహుశా సీనియర్ ఎమ్మెల్యేల పనితీరును ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదన్న ఉద్దేశంతో అధిష్టానం ఉందేమో కానీ, లోకేష్ సాధిస్తున్న ఫలితాలను చూసైనా నేతలు మారాలన్న ఒత్తిడి క్యాడర్ నుంచి పెరుగుతోంది. లోకేష్ తన శాఖల్లో చూపిస్తున్న వేగాన్ని పార్టీ యంత్రాంగం మొత్తం అందిపుచ్చుకోలేకపోవడం ఒక లోపంగా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఇప్పుడు వ్యక్తిగత ఇమేజ్ కంటే ప్రజాబలం ముఖ్యం. లోకేష్ తన ఇమేజ్‌ను మంగళగిరిలో చేసిన సేవా కార్యక్రమాల ద్వారా పెంచుకున్నారు. కానీ, చాలామంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కేవలం ఎన్నికల సమయంలోనే కనిపిస్తారన్న ముద్రను చెరిపేసుకోలేకపోతున్నారు. లోకేష్ సెట్ చేసిన స్టాండర్డ్స్ ఒక రకంగా టీడీపీ నేతలకు సవాల్‌గా మారాయి. ఆయన వేగాన్ని తట్టుకుని నిలబడాలంటే, ఎమ్మెల్యేలు తమ పనితీరును సమూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నారా లోకేష్ ఇప్పుడు 'నెక్స్ట్ జనరేషన్' లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. కేవలం లోకేష్ ఒక్కరు కష్టపడితే సరిపోదని, పార్టీలోని ఎమ్మెల్యేలందరూ అదే స్థాయిలో కష్టపడితేనే 2029 ఎన్నికల నాటికి టీడీపీ మళ్ళీ తిరుగులేని శక్తిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి లోకేష్‌ను చూసి ఈ ఎమ్మెల్యేలు ఎప్పుడు చక్కబడతారో వేచి చూడాలి.

# వడివడిగా రైల్వే జోన్ అడుగులు

**విశాఖపట్టణం–సూర్య వాస్తవం :**
ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల అయిన విశాఖపట్నం రైల్వే జోన్ సౌత్ కోస్ట్ రైల్వే కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర విభజన హామీల్లో ప్రధానమైన ఈ జోన్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని, విశాఖలోని ముడసర్లోవ వద్ద రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 52.2 ఎకరాల భూమిని రైల్వే శాఖ స్వాధీనం చేసుకుందని ఆయన వెల్లడించారురైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 106.89 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటికే పునాది పనులు పూర్తయ్యాయి. 2025 జనవరిలోనే ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన జరిగింది. అయితే, భవన నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, తక్షణమే పాలన సాగించేందుకు వీలుగా విశాఖలోనిభవనం ది డెక్ ను సిద్ధం చేశారు. త్వరలోనే ఇక్కడి నుండే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి జనరల్ మేనేజర్ ,ఇతర ఉన్నతాధికారుల నియామక ప్రక్రియ కూడా పూర్తయినట్లు మంత్రి స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే కేటాయింపుల విషయంలో కేంద్రం రికార్డు స్థాయి నిధులు కేటాయిస్తోంది. 2009–14 మధ్య కాలంలో ఏటా సగటున రూ. 886 కోట్లు మాత్రమే ఉండగా, 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీకి ఏకంగా రూ. 9,417 కోట్లు కేటాయించడం విశేషం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు కొత్త లైన్లు , డబ్లింగ్ పనులతో కలిపి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. గతంతో పోలిస్తే ట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపైందని, ఏటా సగటున 143 కి.మీల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. కొత్త ప్రాజెక్టుల విషయానికి వస్తే, అమరావతి రాజధాని ప్రాంతాన్ని అనుసంధానిస్తూ ఎర్రుపాలెం–అమరావతి–నంబూరు మధ్య 57 కి.మీల కొత్త రైల్వే లైన్ కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.

దీనికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అలాగే విజయవాడ–గూడూరు మూడవ లైన్, గుంతకల్–గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగు తున్నాయని, ఇవి పూర్తయితే ఏపీలో రైలు ప్రయాణం మరింత వేగవంతం కావడమే కాకుండా రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని పేర్కొన్నారు. తెరదించుతూ రైల్వే శాఖ చేపట్టిన ఈ చర్యలు రాష్ట్ర రవాణా ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. త్వరలోనే విశాఖ నుంచి జోన్ పాలన ప్రారంభం కానుండటం గమనార్హం.

## ఉగాది పారణ పండుగ విందులో తులసి రెడ్డి బిజీ బిజీ



**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఆదివారం వేంపల్లి లో ఉగాది పండుగ పారణ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి బిజీ బిజీగా గడిపారు. వృషభా చలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ బస్సు శివారెడ్డి ఇంటిలో ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. తర్వాత కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఇంటిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. అటు తరువాత కాపు వీధిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల శేషారెడ్డి ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబాలు ప్రతీకలు అన్నారు. మనుషుల మధ్య ఆప్యాయతలు, అనురాగాలు, అనుబంధాలు పెంచడంలో పండుగలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. ఉగాది తెలుగు వారి తొలి పండుగ. ఉత్తరాయన పుణ్యకాలం, వసంత రుతువు, చైత్రమాసం, శుక్లపక్షమి పాడ్యమి నాడు బ్రహ్మదేవుడు ప్రళయం అనంతరం సృష్టిని ప్రారంభించాడని నారద పురాణం చెబుతుందని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న,ఐచర్ రమణ, నామా వినయ్, గండి దేవస్థానం మాజీ చైర్మన్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

# అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా కూటమి ప్రభుత్వం తక్షణం అరటి రైతులను ఆదు కోవాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అరటి రైతులు గిట్టుబాటు ధర లభించక, వ్యాపారస్తులు రాక అడిగే వారు లేక కొనేవారు లేక అల్లాడిపోతున్నారన్నారు. ఒక ఎకరా అరటి పంట సాగు చేసేటందుకు లక్ష ఇరవై వేల నుంచి ?1,50,000 వరకు ఖర్చు అవుతుంది. గతంలో ఒకానొక సందర్భంలో వ్యాపారస్తులు ట.న్ను అరటిపళ్లను 32 వేల రూపాయలకు కొనడం జరిగింది. ప్రస్తుతం టన్ను అరటి నాలుగు వేల రూపాయలకు కూడా అడిగే వారు లేరు. అందువల్ల అరటి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే మార్కెట్ ఇంటర్వెన్షన్స్ ద్వారా రంగ ప్రవేశం చేసి టన్ను రూ.15వేలు చొప్పున ప్రభుత్వమే కొన వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మధ్యాహ్న భోజన పథకంలో, అంగన్వాడీ సెంటర్ల లో, హాస్టల్లలో అరటిపల్ల వినియోగాన్ని ప్రభుత్వం పెంచాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**పాతాళానికి పడిపోయిన రూపాయి విలువ**

మోడీ పాలనలో గతంలో ఎన్నడు లేని విధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పాతాళానికి పడిపోవడం శోచనీయమని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేనాటికి 2014లో ఒక డాలర్ విలువ 68 రూపాయలుగా ఉండేది. అప్పుడు నరేంద్ర మోడీ, తదితర బిజెపి నాయకులు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పై వి రుచుకుపడ్డారు. తాము అధికారంలోకి వస్తే రూపాయిని బలోపేతం చేస్తామని ఉత్తర కుమార ప్రగల్బాలు పలికారు. కానీ ప్రస్తుతం గతంలో ఎన్నడు లేని విధంగా రూపాయి విలువ పాతాళానికి పడిపోయింది. ప్రస్తుతం ఒక డాలర్ విలువ 93. 71 రూపాయలుగా ఉంది. ఇది ఆల్ టైం రికార్డ్. దీనివలన దిగుమతుల బిల్లు పెరుగుతుంది.విదేశీ మారక నిల్వలు కరిగిపోతాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పెట్రోల్,డీజిల్,పప్పు ధాన్యాలు, నూనెలు, ఎరువులు, తదితర వాటి ధరలు పెరుగుతాయి. విదేశీ విద్య భారమవుతుంది. వెంటనే రూపాయిని బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తులసి రెడ్డి మోడీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## దేవరగట్టుపల్లి ఓబయ్యను పరామర్శించిన తులసి రెడ్డి



**చక్రాయపేట-సూర్యవాస్తవం:** చక్రాయపేట మండలం, దేవరగట్టుపల్లి గ్రామానికి చెందిన వేల్పుల వరప్రసాద్ తండ్రి వేల్పుల ఓబయ్య గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసిన రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ ఓబయ్యను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

## పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి


**- డీపీఓ వెంకటసుబ్బయ్య**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** జిల్లా వ్యాప్తంగా పంచాయతీ నిధులు 9 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని డీపీఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయన వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ నిధులు 30 కోట్ల రూపాయలు అని వాటిలో 21 కోట్లు మాత్రమే వసూలు చేశారని అన్నారు. ఇంకా 9 కోట్లు వసూలు చేయవలసి ఉందన్నారు. ఈ నెల ఆఖరి కల్లా పన్నులు వసూలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆదివారం సెలవు ఉన్నప్పటికీ పన్నులు వేగవంతం చేయాలనే కారణంతో వేంపల్లెకు వచ్చినట్లు తెలిపారు. ఒక్క వేంపల్లె పంచాయతీ లోనే 4 కోట్ల 10 లక్షలు పన్నులు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటికీ ఒక కోటి పది లక్షలు పన్నులు వసూలు చేశారని అన్నారు. మిగిలిన పన్నులను వేగవంతంగా కట్టించి వేంపల్లె అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు. ఎండా కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త ప్రణాళికలు తయారుచేయాలని ఆయా పంచాయతీలకు సూచించారు. రాజంపేట తాలూకాలో తాళ్లపాక పంచాయతీ, వేంపల్లె పంచాయితీ, ప్రొద్దుటూరులో కొత్తపల్లి పంచాయతీ, పోరుమామిళ్లలో రంగసముద్ర పంచాయతీ, ఈ పంచాయతీలలో పన్నులు ఎక్కువగా వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ సిబ్బంది, బిల్ కలెక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఈవో నాగభూషణం రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం వహించిన మేస్త్రీని సస్పెండ్ చేయాలని ఈవో ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది శివరాం, చాను, గౌసు, పవన్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంపై గరికపాటి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- పేద విద్యార్థుల గురించి హేళనగా మాట్లాడడం దారుణం
- భేషరతుగా విద్యార్థులకు గరికపాటి నరసింహారావు క్షమాపణ చెప్పాలి
- దళిత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్



**పులివెందుల - సూర్య వాస్తవం:** మధ్యాహ్నం భోజనంపై గరికపాటి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, పేద విద్యార్థుల గురించి దారుణంగా మాట్లాడడం గోరమని, విద్యార్థులకు గరికపాటి నరసింహారావు క్షమాపణ చెప్పాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం అయిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఆకలి బాధలు లేకుండా విద్యను అభ్య సించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం దేశంలోనే అత్యంత కీలకమైన సంక్షేమ కార్యక్రమం అన్నారు. అలాంటి పథకాన్ని ఎగతాళి చేస్తూ ప్రముఖ వక్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతా రాహిత్య పూరితమైనవని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్న అన్నారు. గరికపాటి చేసిన వాక్యాలు ఇది కేవలం ఒక పథకంపై విమర్శ కాదు - పేద విద్యార్థుల ఆత్మ గౌరవం పై నేరుగా చేసిన దాడి అని ఆయన అన్నారు .గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం వల్లే పాఠశాలలకు వస్తూ తమ భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని గుర్తు చేశారు. అలాంటి ప్రాణా ధార పథకాన్ని తక్కువ చేసి చూపడం అంటే పేదల ఆకలి, వారి బాధలను అవమానించడమే అన్నారు. సమాజంలో పేరు, గౌరవం ఉన్న వ్యక్తులు మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత ఉండాలి కానీ ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపి విద్యార్థుల మనోభావాలను దెబ్బ తీస్తాయని అని ఆయన అన్నారు.వెంటనే గరికపాటి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని పేద విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


ప్రభుత్వం కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత బలోపేతం చేసి, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ పెంచాలన్నారు. పేదల పిల్లల హక్కులపై ఎవరైనా దాడి చేస్తే చూస్తూ ఊరు కునేదే లేదు అన్నారు. విద్యార్థుల గౌరవం, భవిష్యత్తు కోసం మా పోరాటం మరింత ఉధృతం అవుతుందని పేద విద్యార్థుల గౌరవం కాపాడాలి అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేయాలన్నారు. అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిని ప్రజలు క్షమించరని ఆయన అన్నారు.

## హనుమంతు రాయి చౌదరికి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నివాళి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి కళ్యాణ్ దుర్గం మాజీ ఎమ్మెల్యే హనుమంతురాయి చౌదరి వారి సొంత గ్రామంలో ఎర్రంపల్లిలో దహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, గుత్తి మాజీ మార్కెట్ యర్డ్ చైర్మన్ మోడీ శ్రీనివాస్ యాదవ్, గుత్తి మాజీ ఎంపీపీ వీరేష్, గుంత కల్ మాజీ కౌన్సిలర్ ఎల్లప్ప, కార్యకర్తలు హాజరయ్యారు.

## దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించిన మల్లికార్జున రావు



**వేంపల్లె - సూర్య వాస్తవం:** స్థానిక శ్రీ సాయి నగర్‌లో నూతనంగా వెలసిన దుర్గమ్మ ఆలయాన్ని ఆదివారం కడప విజయ దుర్గాదేవి ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జునరావు సందర్శించారు. ముందుగా దుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకులు, జడ్పీటీసి ఏం. రవి కుమార్ రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలను అందజేసి శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సంద ర్భంగా సుధా మల్లికార్జున రావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం శ్రస్రోత్త బద్ధంగా నిర్మించడం జరిగిందని తెలిపారు. వేంపల్లిలో ఇటువంటి ఆలయం వెలచడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక .చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, వార్డు మెంబర్ ఆంజనేయులు, ఆయనను ఆలయం వద్ద కలిసి ఘనంగా శాలువాతో సత్క రించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్ ఎల్ వి ప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు శ్రీనివాసులురెడ్డి, శివయ్య,శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

**స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ శాంతిలాల్**

**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన, ఇన్స్పెక్టర్ శాంతిలాల్ కడప జిల్లా ఎస్పి నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో, పులివెందుల డిఎస్పి, మురళి ఉత్తర్వుల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం పులి వెందుల పట్టణంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శాంతిలాల్ తన సిబ్బందితో కలసి మైనర్లు నడుపుచున్న వాహనాలను సీజ్ చేసి, వారి సంరక్షకుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అదే విధంగా మైనర్లకు బైకులు ఇవ్వటం వలన మైనర్లతో పాటు వారి సంరక్షకులపైన, సంభందిత వాహన యజమానులపై చట్టపరంగా తీసుకొను చర్యల గురించి వారికి హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా బైకులు నడుపుట వలన, రాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడుపుట, ట్రిపుల్ రైడింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినచో, నూతనంగా అమలులోకి వచ్చిన ఎమ్‌వి యాక్ట్ చట్టం మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు.



# డెంగ్యూ నివారణకు విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

## - సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య




**పులివెందుల రూరల్ - సూర్య వాస్తవం:** పులివెందుల సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహము -1 ను మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆదివారం సందర్శించి దోమలు వృద్ధి చెందకుండా దోమకాటుకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.

**1. నీటి నిల్వలను అరికట్టడం (దోమల ఉత్పత్తి కేంద్రాలు):**
**వాటర్ బాటిళ్లు అండ్ డబ్బాలు:** గదుల్లో ఉపయోగించే వాటర్ బాటిళ్లు, మగ్గులు లేదా పాత డబ్బాల్లో నీటిని వదిలేయకండి. మూతలు లేని పాత్రల్లో నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెడతాయి. కూలర్లు: ఎయిర్ కూలర్లలో నీటిని తరచుగా మారుస్తూ ఉండాలి. వాడనప్పుడు వాటిని పూర్తిగా ఎండబెట్టాలి. పూల కుండీలు: హాస్టల్ బాల్కనీల్లో ఉండే పూల కుండీల కింద ప్లేట్లలో నీరు చేరకుండా చూసుకోవాలి.

**2. వ్యక్తిగత రక్షణ (దోమ కాటు నుండి):**
**దుస్తులు:** డెంగ్యూ దోమలు ప్రధానంగా పగటిపూట కుడతాయి. కాబట్టి కాళ్ళు, చేతులు పూర్తిగా కప్పబడేలా పొడవాటి చొక్కాలు, ప్యాంట్లు ధరించడం ఉత్తమం.
**దోమతెరలు:** నిద్రించే సమయంలో (పగలు లేదా రాత్రి) తప్పనిసరిగా దోమతెరలను వాడాలి.
**రిపెల్లెంట్లు:** దోమలు కుట్టకుండా ఉండేందుకు దోమల నివారణ బిళ్ళలు, కాయిల్స్ వాడాలి.

**3. పరిసరాల పరిశుభ్రత:**
**చెత్తాచెదారం:** తిన్న పదార్థాల కవర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కప్పులను పరిసరాల్లో పడేయకూడదు. వాటిలో వర్షపు నీరు చేరి దోమలు పెరుగుతాయి.
డ్రై డే వారానికి ఒకరోజు (సాధారణంగా ఆదివారం) హాస్టల్ గదులను, సామాగ్రిని శుభ్రం చేసుకుని, ఎక్కడా తడి లేకుండా చూసుకోవాలి.




**4. ఆరోగ్యం పట్ల అప్రమత్తత:**
**జ్వరం వస్తే నిర్లక్ష్యం వద్దు:** హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు లేదా కళ్ల వెనుక నొప్పి అనిపిస్తే వెంటనే హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చి డాక్టర్‌ను సంప్రదించాలి.
**ద్రవ పదార్థాలు:** రోజంతా తగినంత మంచి నీరు, పండ్ల రసాలు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
**ముఖ్య సూచన:** జ్వరం వచ్చినప్పుడు మెడికల్ షాపుల్లో దొరికే పెయిన్ కిల్లర్స్ సొంతంగా వాడకూడదు, ఇది డెంగ్యూ తీవ్రతను పెంచే ప్రమాదం ఉంది. అని విద్యార్థులకు సిద్దయ్య సూచించడమైనది ఈ కార్యక్రమములో హాస్టల్ సంక్షేమ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

# పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** వజ్రకరూరు మండల పరిధిలో వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో స్థానిక బీజేపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సముద్రం శ్రీదేవి, అశోక్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, ప్రశిక్షణా కార్యక్రమం జిల్లా కో కన్వీనర్ కొలిమి రామాంజనేయులు, యువ మోర్చా అశోక్ బిఎల్ఏ ఉరవకొండ అసెంబ్లీ ఇంచార్జ్ రమేష్ వజ్రకరూరు బీజేపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధానంగా భారతీయ జనతా పార్టీ కార్య కర్తల కోసం ఉద్దేశించిన ఒక శిక్షణా కార్యక్రమం. పార్టీ సిద్ధాంతాలను, పని తీరును, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేలాలని కార్యకర్తలకు పిలుపునిచ్చాడు. మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం లో




పాల్గొన్న జిల్లా నాయకులకు, కార్యకర్తలకు మహిళలకు అభినందనలు తెలియజేసాడు.

కార్యకర్తల నైపుణ్యం క్షేత్రస్థాయిలో పనిచేసే కార్య కర్తలకు రాజకీయ, సామాజిక అంశాలపైన, పార్టీ చరిత్రపైన అవగాహన కల్పిం చడం కార్యకర్తలని నాయకులుగా తీర్చిదిద్దడమే ముఖ్య ఉద్దేశం అన్నారు.

# ఘనంగా పదసంచలన్ కార్యక్రమం

## - ఆర్ఎస్ఎస్ కార్యకర్తల భారీ ర్యాలీ

**పులివెందుల - సూర్య వాస్తవం :** పద సంచలన్ కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ పురస్కరించుకొని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పద సంచలన్ కార్యక్రమం లో భాగంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీగా పట్టణంలోని రవితేజ పాఠశాల వద్ద నుంచి పూలంగల సర్కిల్ పానపల్లె రోడ్డు మీదుగా సరస్వతీ విద్యా మందిరంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించి ప్రజల ప్రయోజనాలను రక్షించడమే ఆశయంగా సమాజ దేశ సేవ లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ సంఘాన్ని స్థాపించి నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పదసంచలన్



కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ సర్వేశ్వర్ రెడ్డి, బిజెపి నాయకులు వంగల శశిభూషణ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బద్రి, బాను ప్రకాష్, ఎన్ఆర్వి ప్రసాద్ రెడ్డి విశ్వహిందూ పరిషత్ కళ్యాణ్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గరికపాటి వ్యాఖ్యలను ఖండించిన అఖిల భారత విద్యార్థి సంఘం నాయకులు




**ఉరవకొండ - సూర్య వాస్తవం:** స్థానిక పట్టణ కూడలిలో అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. గరికపాటికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో జిల్లా ఉపా ధ్యక్షులు భీమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులపై గరికపాటి చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయా లు కావని, అవి వర్గపక్షపాతాన్ని, దోపిడీ వ్యవస్థను సమర్థించే విధంగా ఉన్నాయి అన్నారు. ఆకలి, అక్షరం మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోలేని వర్గ దురహంకారం గరిక పాటి వ్యాఖ్యల్లో స్పష్టంగా బయటపడిందని ఆయన పేర్కొన్నారు. గరికపాటి వ్యాఖ్యలను ఖండించాలని, ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

## - ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి




**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకా లమ్మ తల్లికి ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనా మార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది విందులో టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** పులి వెందుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఆదివారం పట్టణంలోని కాపు వీధికి చెందిన టీడీపీ నాయ కులు ఎద్దుల శేషారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది విందు కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, తుంగభద్ర కేసీ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, మండల ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ ఎస్ ఎం డి షబీర్ ,జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి, సీనియర్ జనసేన నేత దాసరి రవి శంకర్, తదితరులు పాల్గొన్నారు.


# లీలావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం





**లింగాల - సూర్య వాస్తవం:** లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న శ్రీ లీలావతి చారిటబుల్ వృద్ధాశ్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు క్రిష్టిపాటి గంగిరెడ్డి, వృద్ధులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. తమ నాయకుడు చవ్వ దుశ్యాంత రెడ్డి, తండ్రి విజయ శేఖర్ రెడ్డి, ప్రథమ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏటా ఏదో ఒక కార్యక్రమం చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొర్రా కేశవ, బోర్రా సాయి వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ గేమ్ ఛేంజర్‌గా రీజనల్ రింగ్ రోడ్

**హైదరాబాద్ -సూర్య వాస్తవం :** హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 161.5 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారిపై ఏఐ కెమెరాలు, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడమే కాకుండా, ప్రమాదాల సమయంలో తక్షణ వైద్య సహాయం అందేలా పోలీసు, రవాణా శాఖలను అప్రమత్తం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సగం తెలంగాణ జిల్లాలను కవర్ చేస్తూ సూపర్ గేమ్ ఛేంజర్‌గా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ఈ రహదారిని నిర్మిస్తుండగా.. ఇప్పటికే ఉత్తర భాగం పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కేంద్రం జాతీయ నంబర్‌ను కూడా కేటాయించి పనుల కోసం టెండర్లు ఆహ్వానించింది. ఇక ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఏఐ టెక్నాలజీతో ఈ భాగం పనులు చేపట్టాలని సర్కార్ భావిస్తోంది.ఇప్పటికే ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించిన యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఏఐ ఆధారిత అధునాతన సాంకేతికతను ఉపయోగించారు. ఈ క్రమంలో తెలంగాణలో ప్రారంభించనున్న కొత్త ఎన్‌హెచ్‌ఏఐ రహదారులకు ఇదే తరహా టెక్నాలజీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతోంది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం పనుల్లో ఈ టెక్నాలజీ వినియోగించడంపై కేంద్రం ఫోకస్ సారించింది. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తంగడ్‌పల్లి వరకు 161.5 కిలోమీటర్ల ఆరు




వరుసలతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారి వెంట ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగించడానికి ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా ఏర్పాట్లు చేస్తోంది. దాంతో పాటుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 4నుంచి 6 వరుసలుగా మార్చడానికి ఇప్పటికే డీపీఆర్ సమర్పించారు.

ఇందులో మొత్తం 232 కిలోమీటర్ల పొడవున సాంకేతికతను ఉపయోగించాలని డిసైడ్ అయ్యారు.ఇందులో భాగంగా అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా తెలంగాణ, ఏపీలోని పోలీసు, రవాణా శాఖలతో రోడ్డు భద్రతను అనుసంధానం చేస్తారు. హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలోనూ కొత్త టెక్నాలజీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలంగాణ పరిధిలో ఈ రహదారి మొత్తం 251 కిలోమీటర్ల మేర ఉండగా పూర్తిస్థాయిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం తీసుకురానున్నారు. ఈ ఏఐ టెక్నాలజీలో భాగంగా రహదారి వెంట అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూంకు

మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తే ఈ కెమెరాలు పట్టేస్తాయి. వెంటనే ఆ వాహనదారుడి అడ్రస్‌కు ఆటోమెటిక్‌గా చలాన్లు వెళ్తాయి. దాంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే అలర్ట్ కావటానికి వైద్య సహాయం అందించటానికి వీలు కలుగుతుంది.

# టీజేపీకి లైన్ క్లియర్


**హైదరాబాద్ -సూర్య వాస్తవం :** తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇప్పుడు సరికొత్త అధ్యాయానికి తెరలేపారు. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు పార్టీ నమోదు ప్రక్రియను కవిత ప్రారంభించారు. సాధారణంగా రాజకీయ పార్టీల నమోదు ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో సాగుతుంది. అయితే, తన దరఖాస్తుపై ఈసీఐ వేగంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జనవరి 23న 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు కోసం ఈసీఐకి దరఖాస్తు చేశారు కవిత. ఫిబ్రవరి 23న దరఖాస్తులో సాంకేతిక లోపాలు ఉన్నాయంటూ ఈసీఐ తిరుగు టపా పంపింది. మార్చి 19న ఢిల్లీ హైకోర్టులో ఈ పిటిషన్‌పై కీలక విచారణ జరగనుంది. ఈ న్యాయపోరాటం ద్వారా పార్టీని సాధ్యమైనంత త్వరగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కవిత భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.గతంలో 'తెలంగాణ జాగృతి' అనే సాంస్కృతిక సంస్థ ద్వారా బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేయడంలో కవిత విజయవంతమయ్యారు. ఇప్పుడు దాదాపు అదే పేరును రాజకీయ పార్టీగా మార్చడం వెనుక సెంటిమెంట్, బ్రాండ్ వాల్యూ రెండూ ఉన్నాయి. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి ప్రాతిపదికన తన రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మిం చుకోవాలనేది ఆమె ఆలోచనగా కనిపిస్తోంది.పార్టీ నమోదు విషయంలో ఈసీఐ లేవనెత్తిన లోపాలు ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారాయి. రాజకీయ పార్టీ నమోదుకు ఉండాల్సిన నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. నిధుల సమీకరణ, పార్టీ రాజ్యాంగం, సభ్యత్వ వివరాల్లో స్పష్టత ఉండాలి. హైకోర్టు ఈ విషయంలో ఈసీఐకి ఎలాంటి దిశానిర్దేశం చేస్తుందనేది పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.బీఆర్‌ఎస్ పార్టీలో కేసీఆర్, కేటీఆర్ నీడలో కాకుండా, తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ వేదిక ఉండాలని ఆమె ఆశిస్తున్నారు. మహిళా సాధికారత, తెలంగాణ హక్కులే ప్రధాన ఎజెండాగా ఈ పార్టీ పనిచేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమె




ఎదుర్కొంటున్న లిక్కర్ స్కామ్ కేసుల నేపథ్యంలో, రాజకీయంగా యాక్టివ్‌గా ఉండటం ద్వారా ఆ ఆరోపణలను ఎదుర్కోవాలని ఆమె యోచిస్తున్నారు. జాగృతి సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్‌ను నేరుగా రాజకీయ శక్తిగా మార్చడం ఈ పార్టీ ఉద్దేశ్యం'తెలంగాణ ప్రజా జాగృతి' ఆవిర్భావం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. యితే సాంకేతిక లోపాలను సవరించుకోకుండా.. కవిత కోర్టుకు వెళ్లడం ఏమిటన్న విస్మయం వ్యక్తమవుతోంది. ఆ సాంకేతిక లోపాలు పరిష్కరించలేనివి అయితే తప్ప ఇలా చేయరని.. భావిస్తున్నారు. కవిత ఇప్పుడు ఆ సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటే తప్ప.. రిజిస్ట్రేషన్ పూర్తి కాదు. ఎలాగోలా నెల రోజుల్లో పూర్తి చేసి తన పార్టీని ప్రకటించాలని కవిత ప్రయత్నిస్తున్నారు.కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్‌కు ఇది అనుబంధ శక్తిగా మారుతుందా లేదా కవిత స్వతంత్ర గళాన్ని వినిపిస్తారా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి ఢిల్లీ హైకోర్టు ఇచ్చే తీర్పు ఈ కొత్త పార్టీ ప్రస్థానానికి పునాది కానుంది.

# పాలిటిక్స్ లోకి నారా రోహిత్...

**తిరుపతి-సూర్య వాస్తవం :**తెలుగుదేశం పార్టీ అంటే ముందుగా గుర్తొచ్చే పేర్లు నందమూరి, నారా కుటుంబాల వారివి. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకు రాగలిగారు నందమూరి తారక రామారావు. అయితే చంద్రబాబు ఆ పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగాను వ్యవహరించారు. నాలుగు దశాబ్దాల పాటు ఆ పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు పాత్ర మరువరానిది. అయితే ఇప్పుడు ఆ పార్టీకి భవిష్యత్తు నాయకుడు లోకేష్ అనడంలో సందేహం లేదు. తనను తాను ప్రూవ్ చేసుకొని ముందుకు సాగుతున్నారు లోకేష్. తెలుగుదేశం పార్టీని అనధికారిక అధ్యక్షుడిగా కొనసాగుతూ.. పార్టీని సమన్వయం చేసుకోవడమే కాదు బలోపేతం చేయడంలో లోకేష్ ముందుంటున్నారు. అదే సమయంలో నందమూరి కుటుంబం నుంచి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు నారా కుటుంబం నుంచి మరో యువ నేత రంగంలోకి వస్తారని ప్రచారం నడుస్తోంది. సినీ నటుడు నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకు బలం చేకూరుస్తూ ఆయన సైతం ఫుల్ క్లారిటీ ఇచ్చారు.చంద్రబాబు నాయుడుసోదరుడిగా రామ్మూర్తి నాయుడు ఉండేవారు. ఆయన ఒకసారి చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. చాలా రోజులపాటు



అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది చనిపోయారు రామ్మూర్తి నాయుడు. ఆయన కుమారుడే నారా రోహిత్. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు.

అతండ్రికి నివాళులు అర్పించేందుకు నారా రోహిత్ వెళ్లారు. పొలిటికల్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందా అని మీడియా ప్రతినిధులు అడిగితే.. కచ్చితంగా ఉంటుందని ఆయన చెప్పారు. తనకు రాజకీయాలు అంటే ఇష్టంగా పేర్కొన్నారు. సరైన సమయంలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తానని కూడా చెప్పుకొచ్చారు.నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యానికి గురికావడంతో నారా రోహిత్ బాధ్యతలను ఎక్కువగా చంద్రబాబు చూసుకున్నారు. ఆయన పొలిటికల్ గా బిజీగా ఉండడంతో పెద్దమ్మ భువనేశ్వరి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొన్న రోహిత్ వివాహంలో కూడా భువనేశ్వరి అన్ని తానై వ్యవహరించారు. పెదనాన్న చంద్రబాబు, సోదరుడు లోకేష్ తో రోహిత్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతుగా రోహిత్ ప్రచారం కూడా చేశారు. లోకేష్ తెలుగుదేశం పార్టీ నాయకత్వ బాధ్యతలు తీసుకుంటే కుటుంబ పరంగా ఆయనకు మద్దతు అవసరం.

అందుకే నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ కి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన చంద్రగిరి నుంచి బరిలో దిగుతారని నారా అభిమానులు భావిస్తున్నారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లోనే కాకుండా పార్టీ పరంగా కూడా నారా రోహిత్ సేవలను టిడిపి నాయకత్వం తీసుకునే ఛాన్స్ కనిపిస్తోంది. పెదనాన్న చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మరుక్షణం టిడిపిలో యాక్టివ్ అయ్యేందుకు నారా రోహిత్ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# విజయ్ పార్టీకి వరుస కష్టాలు...

## - ఖర్చుల భారంతో అభ్యర్థుల ఆందోళన
## -పోటీకి దూరమవుతున్న నేతలు



**చెన్నై-సూర్య వాస్తవం :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొన్నట్లు తెలుస్తోంది. భారీ ఆశలతో రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు పొత్తులు కుదరకపోవడం, ఎన్నికల ఖర్చుల భారం అభ్యర్థులపైనే పడటంతో టికెట్లు ఆశించిన నేతలు ఇప్పుడు పోటీకి వెనకాడుతున్నట్లు సమాచారం.పార్టీ పెట్టిన మొదట్లో విక్రవాండిలో జరిగిన భారీ బహిరంగ సభలో విజయ్ ఇతర పార్టీలకు పొత్తుల కోసం పిలుపునిచ్చారు. తొలుత ప్రధాన ప్రతిపక్షం అన్నాడిఎంకె తో చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే, విజయ్ ఏకంగా 100 సీట్లు కావాలని, రెండున్నర ఏళ్లు ముఖ్యమంత్రి పదవిని పంచుకోవాలని డిమాండ్ చేయడంతో అన్నాడిఎంకె వెనక్కి తగ్గి బీజేపీ వైపు మొగ్గు చూపింది. అటు విదుతలై చిరుతైగళ్ కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వంటి పార్టీలు కూడా డిఎంకె కూటమిని వీడకపోవడంతో విజయ్ చివరకు ఒంటరిగానే బరిలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.తొలుత పార్టీ టికెట్ల కోసం 10 వేల మందికి పైగా ఉత్సాహంగా అప్లికేషన్లు తీసుకున్నప్పటికీ, దరఖాస్తులను తిరిగి సమర్పించిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం పార్టీ అధిష్టానం విధించిన కఠిన నిబంధనలేనని సమాచారం. సీటు ఖరారు కావాలంటే పార్టీకి రూ. 1 కోటి చెల్లించాలని అధిష్టానం ఆదేశించినట్లు చెబుతున్నారు. ప్రచారానికి అదనంగా మరో రూ. 2 కోట్లు అభ్యర్థులే సమకూర్చుకోవాలని స్పష్టం చేయడంతో ఆశావహులు షాక్‌కు గురవుతున్నారు. మొదటి విడత ఇంటర్వ్యూలలో సుమారు 300 మంది ఉత్సాహం చూపినప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులను చూసి చాలామంది వెనకడుగు వేస్తున్నారు. పొత్తులు ఉంటే ఎంతో కొంత నిధులు సమకూరేవి, కానీ ఒంటరిగా అంత భారీ మొత్తం వెచ్చించి ఓడిపోతే పరిస్థితి ఏంటి? అని పార్టీ నేతలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. దీంతో అభ్యర్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి విజయ్‌కు ఏర్పడిందిఎన్నికలకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉన్న తరుణంలో, నేతలను ఎలా ఒప్పించాలి? అభ్యర్థుల ఎంపికను ఎలా పూర్తి చేయాలి? అనే అంశంపై విజయ్ మల్లగుల్లాలు పడుతున్నారు. సొంతంగా నిధులు సమకూర్చలేని పక్షంలో, ధనిక వర్గాలకు లేదా బలమైన స్థానిక నేతలకు మాత్రమే టికెట్లు కేటాయించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో అభ్యర్థుల ప్రకటనపై విజయ్ తీసుకునే నిర్ణయం ఆ పార్టీ భవిష్యత్తును నిర్ణయించనుంది.

# టిక్కెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.223 కోట్ల వసూళ్లు

**హైదరాబాద్ -సూర్య వాస్తవం :** దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో టికెట్ తనిఖీ ప్రక్రియలో రూ. 223.60 కోట్ల రికార్డు ఆదాయాన్ని రాబట్టినట్లు రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైల్వే బోర్డు నిర్దేశించిన రూ . 221.08 కోట్ల లక్ష్యాన్ని, సంవత్సరం ముగియడానికి 14 రోజుల ముందే ఈ జోన్ అధిగమించింది. ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా టికెట్ తనిఖీ ద్వారా వచ్చిన అత్యధిక ఆదాయం ఇదే కావడం విశేషం. ఇంతకు ముందు 2023-24 సంవత్సరం లో రూ . 220.81 కోట్ల ఆదాయం వచ్చింది.టికెట్ లేని ప్రయాణం, ముందుగా బుక్ చేయని లగేజీ మొదలైన వాటిపై నమోదైన కేసుల ద్వారా ఈ ఆదాయం ఆర్జించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ జోన్ ప్రస్తుత సంవత్సరంలో, 2025 అక్టోబర్ 18 న ఒకే రోజులో టికెట్ తనిఖీ ద్వారా రూ . 1.85 కోట్ల రికార్డు ఆదాయాన్ని ఆర్జించింది. రైల్వేలలో టిక్కెట్ల తనిఖీ అనేది, టిక్కెట్టు లేని, సరైన ఆధారాలు లేకుండా చేసే ప్రయాణాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది అలవాటుగా ప్రతినిత్యం టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేసేవారిని నిరోదిస్తూ, బుకింగ్ విండోల ద్వారా టిక్కెట్ల అమ్మకాలు పెరగడానికి దోహదపడుతుంది.రైలు ప్రయాణంలో అధీకృత టిక్కెట్ లేదా ప్రయాణ పత్రం కలిగి ఉండటం ప్రాముఖ్యత గురించి సాధారణ ప్రజలలో అవగాహన కల్పించడానికి కూడా ఇది సహాయపడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. అంతేకాకుండా టిక్కెట్ల తనిఖీ చెల్లుబాటు అయ్యే టిక్కెట్లతో ప్రయాణించడంలో ఉండే సౌకర్యం గురించి ప్రయాణికులకు మార్గనిర్దేశం చేయడానికి తోడ్పడుతుంది. ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, టిక్కెట్ల అమ్మకాలను పెంచడానికి, బుకింగ్ విండోతో పాటు, టిక్కెట్ల జారీ కోసం టిక్కెటింగ్ వ్యవస్థలో అనేక డిజిటల్ కార్యక్రమాలు ప్రవేశపెట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ డిజిటల్ కార్యక్రమాలలో రైల్ వన్ యాప్, బుకింగ్ కౌంటర్ల దగ్గర ఏటీవీఎంలు, స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌ల టిక్కెట్ కొనుగోలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.



# శర్వానంద్ బైకర్ ట్రైలర్ రిలీజ్..

## - గూస్ బంప్స్ తెప్పిస్తున్న విజువల్స్.. శర్వా కెరీర్లో బ్లాక్ బస్టర్ గ్యారంటీ!

శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'బైకర్' .. ప్రస్తుతం ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో ఇండియాలోనే తొలిసారిగా వస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో శర్వానంద్ విక్కీ అనే రేసర్‌గా అదిరిపోయే మేకోవర్‌తో కనిపించారు. ముఖ్యంగా సీనియర్ నటుడు రాజశేఖర్.. శర్వానంద్ తండ్రి పాత్రలో నటిస్తుండటం, వారిద్దరి మధ్య వచ్చే పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసాయి. ఏప్రిల్ 3న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్ విశేషాలు ఇప్పుడు చూద్దాం..ప్రాజెక్ట్ హైల్ మేరీ వీడియో వైరల్..!బైక్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త ప్రయత్నం: టాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకోవడంలో శర్వానంద్ ఎప్పుడూ ముందుంటారు. ఈసారి ఆయన 'బైకర్' అంటూ ఒక సరికొత్త స్పోర్ట్స్ డ్రామాతో మన ముందుకు వస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా, మోటోక్రాస్ రేసింగ్ థీమ్‌తో తెరకెక్కింది. ట్రైలర్ చూస్తుంటే విజువల్స్ చాలా రిచ్‌గా, రేసింగ్ సీన్స్ హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయి. బైక్ రేసింగ్ అంటే ప్రాణమిచ్చే ఒక యువకుడు, తన లక్ష్యం కోసం పడే తపనను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. ఈ సినిమాలో అసలైన హైలైట్ శర్వానంద్ మరియు రాజశేఖర్ మధ్య వచ్చే సీన్స్. ట్రైలర్‌లో వీరిద్దరూ తండ్రీకొడుకులుగా కనిపించారు. అయితే వీరి మధ్య అనుబంధం కంటే ఇగో క్లాష్ ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. "నువ్వు అందరికంటే ముందు రాలేదు.. అందరూ నీకంటే వెనుక వచ్చారు, రెండిటికీ చాలా తేడా ఉంది" అని




రాజశేఖర్ చెప్పే డైలాగ్ తండ్రికి కొడుకుపై ఉన్న గట్టి పట్టును సూచిస్తోంది. క్రమశిక్షణ కోరుకునే తండ్రికి, తనదైన శైలిలో దూసుకుపోయే కొడుకుకి మధ్య జరిగే పోరాటమే ఈ 'బైకర్'.పవర్‌ఫుల్ డైలాగ్స్.. టెక్నికల్ వాల్యూస్: జిబ్రాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ట్రైలర్‌కు ప్రాణం పోసింది. ముఖ్యంగా శర్వానంద్‌ను విక్కీ అన్న పేరుతో పిలవడం, తాప్సీ ఎంట్రీ వంటివి ఆసక్తిని కలిగిస్తున్నాయి. "బైకర్ అంటే స్పీడ్ కాదు.. రెస్పెక్ట్" అని ట్రైలర్ చివర్లో వచ్చే డైలాగ్ సినిమా ఉద్దేశాన్ని స్పష్టంగా చెబుతోంది. రేసింగ్ అంటే కేవలం వేగం మాత్రమే కాదు, అందులో ఒక క్రమశిక్షణ ఉండాలని తండ్రి పాత్ర ద్వారా దర్శకుడు చెప్పించబోతున్నారు. శశర్వానంద్ బైకర్ ట్రైలర్




రిలీజ్.. గూస్ బంప్స్ తెప్పిస్తున్న విజువల్స్.. శర్వా కెరీర్లో బ్లాక్ బస్టర్ గ్యారంటీ!

# ఫిల్మ్స్ వదిలేయాలనుకున్న శ్రీలీల..

## అసలు కారణం ఇదే



టాలివుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల తన అందం, అభినయం, అదిరిపోయే డ్యాన్స్‌తో కుర్రకారు మనసు గెలుచుకున్నరు. హీరోయిన్ గా 'పెళ్లి సందడి'తో ఎంట్రీ ఇచ్చి, అతి తక్కువ కాలంలోనే పవన్ కళ్యాణ్, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించే ఛాన్స్ కొట్టేసింది. అయితే వెండితెరపై ఎప్పుడూ నవ్వుతూ కనిపించే ఈ చిన్నది, కెరీర్ మొదట్లో తీవ్రమైన మానసిక వేదనను అనుభవించిందట. ఏకంగా సినిమాలే వదిలేయాలని నిర్ణయించుకున్న ఆ చేదు జ్ఞాపకాలను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. ఆ విశేషాలు మీకోసం..

**సోషల్ మీడియా ట్రోల్స్ తెచ్చిన కన్నీళ్లు:**

శ్రీలీల కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అతిపెద్ద సమస్య సోషల్ మీడియా ట్రోలింగ్. మనం చూస్తుంటాం కదా, ఎవరో ఏదో అన్నారని మనం ఎంత బాధపడతామో, సెలబ్రిటీల పరిస్థితి అంతకంటే దారుణంగా ఉంటుంది.ఇక శ్రీలీల చాలా సున్నిత మనస్కురాలు కావడం వల్ల, నెటిజన్లు చేసే నెగిటివ్ కామెంట్స్ తనను బాగా గాయపరిచాయట. "మొదట్లో ఆ ట్రోల్స్ చూసి తట్టుకోలేకపోయేదాన్ని, ఒంటరిగా కూర్చుని చాలా ఏడ్చేదాన్ని" అంటూ తన మనసులోని బాధను బయటపెట్టింది. చిన్న వయసులోనే అంత నెగిటివిటీని చూడటం ఆమెకు పెద్ద సవాల్‌గా మారింది.

**సినిమాలకు గుడ్ బై చెప్పాలనుకున్న క్షణం:**

ఇక ట్రోలింగ్ మరీ ఎక్కువ కావడంతో ఒకానొక దశలో శ్రీలీల పూర్తిగా నిరాశకు లోనైందట. ఇక గ్లామర్ ప్రపంచం తనకు వద్దని, ప్రశాంతంగా చదువుకుంటానని నిర్ణయించుకుంది. వెంటనే తన తల్లి దగ్గరకు వెళ్లి, "అమ్మా, నాకు ఈ సినిమాలు వద్దు.. నేను మళ్ళీ కాలేజీకి వెళ్లి నా చదువు కంటిన్యూ చేస్తాను" అని చెప్పిందట. ఎంత ఒత్తిడి ఉంటే ఒక హీరోయిన్ అంతటి నిర్ణయం తీసుకుంటుందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఆమె తల్లి ఇచ్చిన ధైర్యం, సపోర్ట్ వల్లే శ్రీలీల మళ్ళీ వెనక్కి తగ్గకుండా పోరాడగలిగింది.






# కావ్య మారన్ పై హేట్ హీట్..

# అతడు మాత్రం సింపుల్ కూల్..

సరిగ్గా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ముంగిట ఎందుకు జరిగిందో కానీ.. సౌత్ ఆఫ్రికా లీగ్ ది హండ్రెడ్ లీగ్ వేలం సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) ఓనర్ కావ్య మారన్ కు తలనొప్పులు తెచ్చిపెట్టింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో... అదీ పొలిటికల్ గా తమిళనాడులో ఎన్నికలు జరుగుతుండగా అక్కడి అధికార పార్టీ డీఎంకేతో సంబంధం ఉన్న సన్ టీవీ గ్రూప్ నకు చెందిన ఎస్ఆర్ హెచ్ యాజమాన్యానికి మరో రూపంలోనూ వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇదంతా పాకిస్థాన్ ఓవర్ యాక్షన్ ప్లేయర్ అబ్రార్ అహ్మద్ ను ది హండ్రెడ్ లీగ్ వేలంలో సన్ రైజర్స్ కొనుగోలు చేయడంతోనే వచ్చింది. అసలే గత ఏడాది పెహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఇంతలోనే గత సెప్టెంబరులో జరిగిన ఆసియాకప్ లో పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ లు ఇవ్వకపోవడం, ఆపై ఆ జట్టు మీద ఫైనల్లో గెలిచాక టైటిల్ ను పాక్ బోర్డు, ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ అయిన మొహిసిన్ నఖ్వీ ఎత్తుకుపోవడంతో రగడ పెద్దదైంది. తాజాగా టి20 ప్రపంచ కప్ ముందు పాక్ పన్నిన కుయుక్తులు అన్నీ ఇన్నీ కావు. బంగ్లాదేశ్ ను ముందుకు నెట్టి టోర్నీని బహిష్కరించేలా చేసింది. ఆపై భారత్ తో శ్రీలంకలో జరిగే మ్యాచ్ ను బాయ్ కాట్ చేస్తామని బీరాలు పోయింది. చివరకు తోక ముడిచింది. ఓడిపోయింది కూడా. ఇంత దారుణంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న సమయంలో అబ్రార్ ను తీసుకోవడం సన్ రైజర్స్ కు బ్యాడ్ నేమ్ తెచ్చింది.

**అది బ్లడ్ మనీ..**

అబ్రార్ కు ది హండ్రెడ్ లీగ్ లో సన్ రైజర్స్ ఇచ్చే డబ్బులో పన్ను కింద కొంత పాక్ ప్రభుత్వానికి వెళ్తుందని, అది చివరకు వారి సైన్యంపై పెడతారని, వారు మనతో ఘర్షణకు దిగుతారని పేర్కొంటూ.. దానిని బ్లడ్ మనీ అని అభివర్ణించాడు క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్. అయితే, అదేమీ ఐపీఎల్ కాదంటూ ది హండ్రెడ్ లీగ్ పై బీసీసీఐ స్పందించింది. కానీ, అంతటి గావస్కర్ తీవ్రంగా స్పందించాక.. ఇక చెప్పేదేముంది? ఈ నేపథ్యంలో కావ్య మారన్ నాయకత్వంలోని సన్ రైజర్స్ కు సంకట స్థితి ఏర్పడింది. ఈ ప్రభావం ఐపీఎల్ లో జట్టుపై పడుతుందా? అనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

**ఇంతకూ అబ్రార్ ఏమంటాడు?**

మొన్నటివరకు సన్ రైజర్స్ ఓనర్ కావ్య మారన్ ను ఒక ఏంజెల్ లా చూసిన అభిమానులు.. ఈ ఏడాది ఎలా స్పందిస్తారో అన్నది చర్చనీయంగా మారింది. ఇంతకూ వివాదానికి మూలకారణమైన అబ్రార్ ఏం చేస్తున్నాడో తెలుసా? అతడు చాలా కూల్ గా ఉన్నాడట. పైగా టి20 ర్యాంకింగ్స్ లో మూడో స్థానంలో ఉన్న అతడు తన ప్రాక్టీస్ తాను చేసుకుంటూ పోతున్నాడట. తాజా రగడ తనపై ఏమాత్రం ప్రభావం చూపడం లేదని అంటున్నారు. మరోవైపు మా వాడు టాప్ 3 బౌలర్. అందుకే విదేశీ లీగ్ లలో అతడికి డిమాండ్ అంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మురిసిపోతుందట. అంటే, పరోక్షంగా తమ క్రికెటర్ ప్రతిభతోనే తీసుకున్నారు తప్ప.. మీరు గొప్ప ఏమీ లేదని పరోక్షంగా సన్ రైజర్స్ యాజమాన్యానికి చురకేసిందన్నమాట.

# పారా జాతీయ స్థాయి పోటీల్లో జిల్లాకు పతకాల పంట

## సత్తా చాటిన కిల్లక లలిత, కరణం గౌతమ్



**విజయనగరం టౌన్ :** ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ లోని కళింగ స్టేడియం వేదికగా మార్చి 18 నుండి 21 వరకు నిర్వహించిన 24వ జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించడం జరిగింది. ఆదివారం ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం గుల్లలంక గ్రామానికి చెందిన పరుగుల రాణి కిల్లక లలిత (టి -11 కేటగిరి ) 400 మీటర్లు పరుగులో గోల్డ్ మెడల్, 1500 మీటర్లు పరుగులో బ్రాంజ్ మెడల్ సాధించగా బబ్బిలి మండలం ఎం. వలసకు చెందిన పారా క్రీడాకారుడు కరణం గౌతమ్ (టి -12 కేటగిరి ) లాంగ్ జంప్ లో బ్రాంజ్ మెడల్ గెలుచుకుని జాతీయ స్థాయిలో జిల్లా పేరు మారుమోగేలా చేశారు. బలమైన సంకల్పం, నిరంతర సాధన ఉంటే అనుకున్నది సాధించేందుకు వైకల్యం ఏమాత్రం అడ్డు కాదని జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు నిరూపించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ రాం సుందరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా క్రీడాభివఅద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె .దయానంద్ లు అభినందనలు తెలియజేసారు భవిష్యత్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని అకాంక్షించారు.

## మటన్ ఉడకలేదని పోలీస్ స్టేషన్‌కు..

- ఇదో వింత ఘటన



**అనంతపురం - సూర్య వాస్తవం :** తాడిపత్రికి చెందిన ఓ వ్యక్తి ఉగాది సందర్భంగా మటన్ కొనుగోలు చేశాడు. దానిని సుమారు 20 సార్లు ఉడికించినా ఉడకకపోవడంతో విక్రయదారుడిపై ఫిర్యాదు చేసేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. తను వండిన వంట పాత్రతో సహా స్టేషన్‌కు నేరుగా తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చివరకు పోలీసులు అతనికి సర్ది చెప్పి ఇంటికి పంపారు.

## రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ర్యాలీ



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది ఉత్సవం సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ నుంచి బుడ్డయ్యపాలెం వరకు తిరిగి బుడ్డయ్య పాలెం నుంచి మార్కెట్ రూట్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించి ప్రజల ప్రయోజనాలను రక్షించడమే ఆశయంగా సమాజ దేశ సేవ లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ సంఘాన్ని స్థాపించి నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పదసంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు.

## కేశఖండన వేడుకల్లో భూమిరెడ్డి ఉమాదేవి



**వేముల - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గం వేముల మండలం పేర్లపాడు గ్రామానికి చెందిన చిన్న అంకిరెడ్డి మనవ రాలు పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా అంకిరెడ్డి కుటుంబ సభ్యులతో ఉమాదేవి కలిసి ఆనందంగా గడిపారు. అనంతరం పలువురు ఆమెను కేశఖండన వేడుకలో ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ సహకారంతో సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సోమిరెడ్డి పల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సొసైటీ ఛైర్మన్ ఎల్లటూరి సాంబశివారెడ్డి రూ.25లక్షలతో సిమెంట్ రోడ్‌కి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పూజ శివయ్య, మేకల సుధాకర్, గంగిరెడ్డి చిలమల నాగయ్య శ్రీను, భాస్కర్ వీరయ్య, శివ, గంగరాజు, అధికారులు గ్రామ ప్రజలు ఉన్నారు.

# యూఏఈనే లక్ష్యంగా చేసుకొని...

## - ఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి పలు డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించిన ఇరాన్

**టెహ్రాన్ - సూర్య వాస్తవం**

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నది ఓ సామెత. ఇజ్రాయిల్-అమెరికా, ఇరాన్ మధ్య మొదలైన యుద్ధంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పరిస్థితి కుడితిలో పడిన ఎలుక మాదిరిగా తయారైంది. ఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి యూఏఈపై ఇరాన్ 1,714 డ్రోన్లు, 334 బాలిస్టిక్ క్షిపణులు, 13 క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడులలో అనేక హోటళ్లు, రిఫైనరీలు, విమానాశ్రయాలు, వాణిజ్య మండలులు దెబ్బతిన్నాయి. యూఏఈనే ఇరాన్ ఎందుకు లక్ష్యంగా ఎంచు కుంది? అక్కడ అమెరికా తన సైనిక కేంద్రాలను నిర్వహించడమే దీనికి కారణమా? ఈ ప్రశ్నలకు సమాధానం కొంత క్లిష్టంగానే ఉంటుంది. యూఏఈతో అమెరికాకు బలమైన ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత భారీగా విదేశీ పెట్టు బడులను ఆహ్వానించారు. ఇతర భాగస్వాముల కంటే ఉదారంగా స్పందించిన దేశం యూఏఈయే.

శ్వేతసౌధం అందించిన వివరాల ప్రకారం...అమెరికాలో పది సంవత్సరాల కాలంలో 1.4 ట్రిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానని యూఏఈ హామీ ఇచ్చింది. అమెరికాకు అందిన మొత్తం హామీలలో ఇది 27 శాతం. ఖతార్, జపాన్, సౌదీ అరేబియా, భారత్, దక్షిణ కొరియా, బహ్రైన్, ఐర్లాండ్ కూడా అమెరికాలో పెట్టుబడులు పెడతామని తెలిపాయి. ట్రంప్ పొందే విదేశీ పెట్టుబడులలో 62 శాతం అరబ్ దేశాల నుంచి వచ్చేవే. యూఏఈని ఇరాన్ లక్ష్యంగా చేసుకోవడానికి ఈ పెట్టుబడులు ఒక్కటే కారణం కావు. అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా యూఏఈ ఆవిర్భవించడం కూడా కారణమే. గత దశాబ్ద కాలంలో యూఏఈలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా వెయ్యికి పైగా వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలలో



వంద శాతం విదేశీ యాజమాన్యాన్ని దుబాయి ప్రభుత్వం అనుమతించిన తర్వాత ఈ పెట్టుబడులు బాగా వచ్చాయి.

ప్రపంచబ్యాంక్ డేటా ప్రకారం...యూఏఈలోకి 2018లో 10.4 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు రాగా 2021 నాటికి అవి దాదాపుగా రెట్టింపై 20.7 బిలియన్ డాలర్లకు చేరాయి. 2024లో అవి రెట్టింపు కంటే ఎక్కువై 45.6 బిలియన్ డాలర్లు అయ్యాయి. 2024లో పశ్చిమాసియా లోకి వచ్చిన పెట్టుబడులలో ఒక్క యూఏఈ వాటానే 56 శాతం. ప్రపంచంలో ఎక్కడా లేనన్ని కొత్త గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు దుబాయి నగరంలోనే ఉన్నాయి. యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్ వంటి మధ్యప్రాచ్య ఆర్థిక వ్యవస్థలు రాజకీయంగా స్థిరంగా ఉన్నాయి. అక్కడ పెట్టే పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయి. మరీ ముఖ్యంగా యూఏఈ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన దేశంగా నిలిచింది. యూఏఈని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అమెరికాపై నేరుగా దాడి చేయకుండానే దాని ప్రధాన ఆర్థిక భాగస్వామిని ఇరాన్ దెబ్బతీస్తోంది. యుద్ధభూమికి దూరంగా ఉన్న అమెరికా ఆర్థిక ప్రయోజనాలపై సైతం దాడి చేయగలనన్న సంకేతాన్ని పంపుతోంది. యూఏఈపై ప్రపంచ దేశాలకు ఉన్న నమ్మకం సడలిపోయేలా చేయడం కూడా ఇరాన్ వ్యూహంలో భాగమే. ఎందుకంటే యూఏఈపై ఇరాన్ చేసే ప్రతి దాడీ దాని ఇమేజ్‌ను దెబ్బతీస్తుంది.

**షార్జా సమీపంలో నౌకపై దాడి**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన షార్జాకు ఉత్తరంగా పదిహేను నాటికన్ మైళ్ల దూరంలో ఓ నౌకపై దాడి జరిగింది.

ఈ దాడి నుంచి నౌకలోని సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని యునైటెడ్ కింగ్‌డమ్ మారీటైమ్ ట్రేడ్ ఆర్గనైజేషన్స్ (యూకేఎంటీఓ) ఆదివారం తెలిపింది. ఈ దాడి లక్ష్యమేమిటో తెలియదని, దీనిపై అధికారులు విచారణ జరుపుతున్నారని చెప్పింది.


# జైళ్లలో రద్దీపై సుప్రీంకోర్టు ఆందోళన

## -- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

దేశవ్యాప్తంగా జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఖైదీల రద్దీని నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న కనీస వసతులపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా జైళ్లలో స్థితిగతులపై దాఖలైన పిటిషన్‌ను సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం, ఈ ఏడాది మార్చి 1 నాటికి జైళ్లలో ఉన్న ఖైదీల సంఖ్య, మంజూరైన సామర్థ్యం వంటి వివరాలను మే 18 లోగా అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని ఆయా హోంశాఖ కార్యదర్శులను ఆదేశించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

జైళ్లలోని చిన్నారులకు విద్య, ఆరోగ్య సదుపాయాలపైనా.. మహిళా ఖైదీలు.. వారితో పాటు ఉంటున్న చిన్నారుల



భవిష్యత్తుపై గురించి కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఆయా చిన్నారులకు అందుతున్న విద్య, ఆరోగ్య సదుపాయాలపై స్పష్టత ఇవ్వాలని కోరింది. జైళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి తీసుకుంటున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అమికస్ క్యూరీ అందించిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు జైళ్లలో పాలనా సంస్కరణలు అనివార్యమని అభిప్రాయపడింది. ఈ విచారణను సమర్థంగా పరిగణనలోకి తీసుకోవడానికి తాజా సమాచారం అందుబాటులో ఉండటం అత్యవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నమోదు చేసిన గణాంకాలు 2023 సంవత్సరానికి సంబంధించినవని తమ దష్టికి తీసుకువచ్చినట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ కేసు తదుపరి విచారణను మే 26కు వాయిదా వేసింది. మరోవైపు మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేసిన వీడియోలను ప్రజలు వెంటనే సామాజిక మాధ్యమాల్లో పంచుకునే ధోరణి పట్ల సుప్రీం కోర్టు శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారతాయని చెప్పింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాల్లో అప్‌లోడ్ చేసి, ప్రజల్లో పక్షపాత ధోరణిని సష్టిస్తున్నారంటూ ఓ పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోరుమాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది.





## తేనిటీ విందులో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** పవిత్రమైన రంజన్ మాసం సందర్భంగా రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డ్ కౌన్సిలర్, టిడిపి మైనార్టీ నాయకుడు కొలిమి హరూన్ బాషా ఆదివారం ఇచ్చిన విందు కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి వారి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. కొలిమి హరూన్ బాషా కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వెంట టీడీపీ మైనార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

## నేడు చలివేంద్రం ప్రారంభం

**శింగనమల- సూర్య వాస్తవం:** శింగనమల క్రాస్‌లో సోమవారం ఉదయం 10:45 గంటలకు శ్రీ ఋషి శృంగ మహాముని గంపమాలయ స్వామి వారి ఆశీస్సులతో చలివేంద్రం ప్రారంభం చేయుచున్న జె రాంచరణ్ యాదవ్ ఈ సందర్భంగా రామ్ చరణ్ యాదవ్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల శింగనమల క్రాస్ లో ప్రయాణికులు బస్సులు,ఆటోల కోసం వేచి ఉంటారు వారి సౌకర్యార్థం ప్రయాణికులు సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో టైం పడుతుందని అక్కడ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు, అలాగే ప్రయాణికులు ఎండ తీవ్రత కు సెగ తీరడానికి కుర్చీలు కూడాఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శింగనమల అధికారులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా శ్రీ ఋష్య శృంగ మహాముని ట్రస్టు సభ్యులు రామ్ చరణ్ యాదవ్ తెలిపారు

## నేడు శ్రీరామనవమి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

**అనంతపురం- సూర్య వాస్తవం:** నేడు ఉదయం స్థానిక శ్రీనివాస్ నగర్ లో గల శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో 11-00 గంటల నుండి 11:30 గంటల వరకు కమిటీ సభ్యులతో, శ్రీవారి సేవకులకే శ్రీ సీతారాముల కళ్యాణం ఉత్సవం శ్రీరామ సందర్భంగా ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించబడుతున్నాయి. కావున ఇదే మా ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆ శ్రీరాముని ఆశీస్సులు పొందాలని కోరుకుంటున్నామని ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )